క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కడిపికొండ టౌన్, ఆర్జీకే కడిపికొండ, సూర్య కుటీర్, అయోధ్యపురం, బోడగుట్ట, భట్టుపల్లి, కొత్తపల్లి ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ ఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు పెన్షనర్స్ డే

హన్మకొండ: హనుమకొండ కాకాజీ కాలనీలోని ఎస్ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 29న పెన్షనర్స్ డేను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం జరగనున్న కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు అవార్డు గ్రహీతకు సన్మానం

హన్మకొండ అర్బన్: ఈనెల 21న హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో 'బెస్ట్ అంకాలజిస్ట్ అండ్ హెమటాలజిస్ట్ ఇన్ తెలంగాణ' కేటగిరిలో జిల్లాకు చెందిన డాక్టర్ బొల్లం రాజేష్ 'ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు –2024'ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈమేరకు ఓసీ సంఘాల ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డులోని సహస్ర డీఎల్‌ఏ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సన్మానించనున్నట్లు ఓసీ సంఘాల నాయకులు తెలిపారు.

కల్పనకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు, వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన కల్పన గిన్నెకు ఆ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సింథసిస్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ పాలిమర్ బేస్డ్ నానో కాంపోసిట్లు బైసాల్ జెల్‌మెథడ్ అండ్ థెయిర్ ఫొటో కెటాలిక్ యాక్టివిటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కల్పనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సిద్దోజు కవిత పర్యవేక్షణలో కల్పన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సిక్కుల ర్యాలీ



హన్మకొండ చౌరస్తా: హిందూ పరిరక్షణకు ప్రాణత్యాగాలు చేసిన సిక్కు మతగురువు గురుగోవింద్ సింగ్ మహారాజ్ కుమారులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ హనుమకొండలోని కాకతీయ కాలనీలోని సిక్కువాడ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అమరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. అంతకుముందు సిక్కు మత సంప్రదాయ పద్ధతిలో తలపాగా, తల్వార్ పట్టుకుని గురుద్వార్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురుద్వార్ కమిటీ బాధ్యుడు సర్దార్ హరిసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అధికారి



వరంగల్ అర్బన్: నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా ఉద్యాన శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కొనసాగుతున్న సమ్మె

విద్యారణ్యపురి: తమకు పేస్కేల్‌ను వర్తింపజేయాలని, రెగ్యులరైజ్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 22 రోజులకు చేరుకుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్రశిక్ష ఉద్యోగులు ఏకశిల పార్కువద్ద చేపట్టిన దీక్షలకు కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజు యాదవ్ సంఘీభావం తెలిపారు. సమ్మెలో సమగ్ర ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.షఫీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ కొత్తవాడ శివారులోని చిల్డ్రన్ పార్కు కబ్జాపై ఎట్టకేలకు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు కళ్లు తెరిచారు. కబ్జాదారులు వేసిన ఫెన్సింగ్‌ను శనివారం తొలగించారు. కబ్జాలకు గురికాకుండా పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడ చూసినా చెత్తాచెదారం



మధ్యకోటలో రాతికోట పక్కన చెత్తడంపింగ్ యార్డులో నుంచి వెలువడుతున్న పొగ

ఖిలా వరంగల్: పారిశుద్ధ్య నిర్వహణకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామని, అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న అధికారులు, నాయకుల మాటలు ఉత్తమాటలే అని అర్థమవుతోంది. మధ్యకోటలో రాతికోట వెంట నిర్మించిన సీసీ రోడ్డులో ఇష్టారాజ్యంగా చెత్తాచెదారాన్ని డంప్ చేస్తున్నారు. ఇళ్లల్లో సేకరించిన చెత్తను ఒకచోట కుప్పగా పోసి మధ్యాహ్నం వేళల్లో నిప్పుపెట్టడంతో దుర్గంధంతో కూడిన దట్టమైన పొగతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాతికోట చుట్టూ రోడ్డుపై తిరుగుతూ కోట అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు సైతం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వ్యర్థాలతో కోట పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి.
ఉదయాన్నే ఇళ్లలోని చెత్తను సేకరించి నేరుగా రాతికోట పక్కన ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ కేంద్రానికి పారిశుద్ధ్య కార్మికులు తరలిస్తున్నారు. అనంతరం ఆ చెత్తకు మంటపెడుతున్నారని బల్దియా ఉన్నతాధికారులకు సమాచారం అందజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగతో విషజ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

సాయుధ పోరాటయోధుడు దర్గ్యానాయక్



నివాళులర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కాజీపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్గ్యానాయక్ సంతాపసభను 61వ డివిజన్ 100 ఫీట్ రోడ్డులో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోతు వీరన్న శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గ్యానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభాధ్యక్షుడు విస్లావత్ చక్రు మాట్లాడుతూ నిజాం పాలకులకు వ్యతిరేకంగా గళంవిప్పి పోరాడిన మహాయోధుడు దర్గ్యానాయక్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, తొట్టె మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాజీపేట మండల గిరిజన కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా బానోతు సురేష్, కోకన్వీనర్‌గా బోడ సోమ్లు, సభ్యుడిగా నారియా, సభ్యులుగా గుగులోతు శంకర్ నాయక్, భూక్య భిక్షపతి, సురేష్, బాలు, నరసింహ, భూక్య రాజు ఎంపికయ్యారు.

కేసును నీరుగారిస్తే ఆందోళన చేస్తాం



నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రామన్నపేట: నిరుపేద దళితుడైన చింత కుమారస్వామి ఇంటిపై దాడి చేసి కులం పేరుతో దూషించి, ఇకపై బండ కొట్టొద్దని బలవంతంగా కాళ్లు మొక్కించుకున్న వడ్డెర కులస్తులను చట్టప్రకారం వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ అన్నారు. కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్తే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధిత కుటుంబ సభ్యులతో నగరంలోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లోని ఏసీపీ కార్యాలయంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయకును శనివారం కలిసి న్యాయం చేయాలని కోరారు. ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, చాడ ప్రదీప్, మల్లేశం, రమేష్, లింగాల రాజన్ బాబు, మోరే ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

హసన్‌పర్తి: అంబేడ్కర్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ హక్కుల విలువల పరిరక్షణ ఉద్యమంలో భాగంగా హసన్‌పర్తి మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. భూమిలేని ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, రాష్ట్ర నాయకురాలు సంపూర్ణ, జిల్లా కార్యదర్శులు చుంచు నరేష్, మేకల అనిత, రాధ, నాయకులు పసుల దాసు, దోమ కొమురయ్య, సదానందం, గాజుల రాజు, చుంచు సుందర్ పాల్గొన్నారు.


ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగుల సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈమేరకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటివరకు క్రమబద్ధీకరించలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆయా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘాల జేఏసీ బాధ్యులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, డాక్టర్ సదయ్య, రాయికంటి సురేష్‌కుమార్, నాగుల శివప్రసాద్, సంగాల రాజమౌళి, దయాకర్, సంగాల సుధాకర్, గోపి, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్‌తో బలహీన వర్గాలకు నష్టం



అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌తో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు, అట్టడుగు బలహీన వర్గాలకు నష్టం జరుగుతోందని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈలోని జాఫర్ నిజాం సెమినార్‌హాల్‌లో శనివారం జరిగిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వలన ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్యాయం అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. సమావేశంలో స్వేరోస్, ఎంఎస్ఎఫ్, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, కుర్మా, ఎస్ఎస్‌బీఎంబీఎం వ్యవస్థాపకులు, సేవాలాల్, బీసీ సంఘం, డీఎస్ఏ, పీడీఎస్‌యూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

హన్మకొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు విమర్శించారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను ఆగంచేస్తూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ విధానాలనే అనుసరిస్తూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో సతమతం అవుతున్నాయని వాపోయారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆరెపల్లి సుజిత్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు మేరుగు సాయికుమార్, వరంగల్ మహానగర కార్యదర్శి తాళ్లపల్లి అరుణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శావణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై పోరాడాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజిత పిలుపునిచ్చారు. కేయూలో శనివారం నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 23, 24, 25వ తేదీల్లో సిద్దిపేటలో జరిగిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో విద్యారంగ పరిస్థితులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై, గురుకులాల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేసినట్లు గుర్తుచేశారు. సమావేశంలో ఏబీవీపి కేయూ అధ్యక్షుడు సాయి, సెక్రటరీ శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం స్వీకరిస్తున్న సంధ్యారాణి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

- వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్/కాశిబుగ్గ సెంటర్: జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవితో కలిసి ఆమె వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రతినెల చివరి రెండో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ప్రమాదంలో కాలుపోయిందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, స్కూటీ ఇచ్చి ఉపాధి కల్పించాలని నగరంలోని కోటిలింగాలకు చెందిన కొండపల్లి సురేష్ విన్నవించాడు. కాలు లేదు.. నడవడం కష్టంగా ఉందని, త్రీ వీలర్ వాహనం కావాలని కరీమాబాద్‌కు చెందిన మట్టెవాడ వెంకటనారాయణ వినతిపత్రం సమర్పించారు.మొత్తం 30 దరఖాస్తులు రాగా.. అందులో డీఆర్‌డీఏ 9, డీడబ్ల్యూఓ 6, జెడ్పీ 8, సివిల్ సప్లయీస్ 4, ఎంప్లాయ్‌మెంట్ 2, జీడబ్ల్యూఎంసీకి 1 దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

వరంగల్: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి, వేతనాలు పెంచాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలను పెంచాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నామన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ నాయకులు పాలడగుల భాస్కర్, యూసుఫ్, అరుణ్‌కుమార్, వెంకన్న, గణేశ్, వెంకటయ్య, వెంకటరాజం, దాసు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ



ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో సత్యసాయినగర్ కాలనీలో గురుస్వామి కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్ణాకర్‌రెడ్డి, పల్ల కార్తీక్ రెడ్డి, సోమిరెడ్డి, ధర్మారెడ్డి సహకారంతో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శనివారం జరిగింది. వేద పండితుడు అనిల్‌శర్మ నేతృత్వంలో పద్దెనిమిది మెట్ల పడిపై గణపతి, లక్ష్మి, అయ్యప్పస్వామిని ప్రతిష్ఠించి పూజ నిర్వహించారు. అయ్యప్ప భజన మండలి, గాయకుడు కొల్లూరి యోగానంద్ బృందం అయ్యప్పస్వామి కీర్తనలు, భక్తిగీతాలు ఆలపించారు. పూజలో రాందాస్, కత్తి ఎల్లాగౌడ్, కంచ మల్లయ్య, కర్ణాకర్, రాంబాబు, కన్నయ్య, రంజిత్, మిరియాల శ్రీనివాస్, కపిల్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల వేణుమాధవ్‌కు నివాళి



హన్మకొండ కల్చరల్: ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని వేణుమాధవ్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, సల్వాజీ, రవీందర్‌రావు, ఖలీల్, బైరిపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మాక్ డ్రిల్ చేస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

ఖిలా వరంగల్: ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం సంభవిస్తే తక్షణమే ఎలా స్పందించాలి, ఘటన స్థలానికి ఎలా చేరుకోవాలి, క్షతగాత్రులను ఎలా రక్షించాలన్న దానిపై ప్రత్యక్షంగా అధికారులు, సిబ్బంది క్షణాల్లో చేరుకుని సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈక్రమంలో అసలు ఏమి జరుగుతుందోనని ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. మాక్ డ్రిల్ అని తెలుసుకుని భయాందోళన నుంచి తేరుకుని ఆసక్తిగా తిలకించారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



జెండా ఆవిష్కరణలో ఆర్‌ఎల్.మూర్తి, తదితరులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 డిసెంబర్‌లో కేరళలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. అప్పటినుంచి విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై పోరాడుతూనే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, బాధ్యులు కల్యాణ్, మడికొండ ప్రశాంత్, పరిమళ, బీరెడ్డి యశ్వంత్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

హన్మకొండ అర్బన్: ఇటీవల ఏకశిల కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిని గుగులోతు శ్రీదేవి మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఈ ఘటనకు బాధ్యులైన పాఠశాల యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకశిల జూనియర్ కళాశాల హాస్టళ్లకు అనుమతులు లేవని, అక్రమంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ నాయకులు నరేష్, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పంజాల రేవంత్, రామ్మోహన్, శివకుమార్ పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఖిలా వరంగల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కేయూ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం కృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్ ఏసీరెడ్డినగర్‌లో డీవైఎఫ్ఐ సాంబమూర్తి, ఎస్ఎఫ్ఐ బాధ్యుడు ప్రశాంత్ అధ్యక్షతన శనివారం జరిగిన సెమినార్‌లో కృష్ణ మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానిస్తూ పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని అన్నారు. కార్యక్రమంలో దుర్గయ్య, అవుల ఉదయ్‌కుమార్, చుక్క ప్రశాంత్, భవాని, అనిత, మంజుల స్వాతి, షమీనా, రజియా, రాజు, మానస, జరీనా, భాగ్య, లక్ష్మక్క బాబు, భద్రం, రాజశేఖర్, మహేష్, అరుణ్‌సాయి, కృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలి

కాశిబుగ్గ సెంటర్: వికలాంగులకు స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని వారికి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి డివిజన్‌లో దివ్యాంగులకు రావాల్సిన 5శాతం రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలని నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అజీమ్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌లో ఫోరం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు బండి చక్రపాణి, సతీష్, బత్తిని రాజు, చెన్నూరి మహేష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, సేవాలాల్ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్ కోరారు. ఈమేరకు వీసీ ప్రతాప్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు యాదగిరి, ముత్యాల శ్రీసాయిగౌడ్, కుమార్, లాల్‌సింగ్, సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

విద్యారణ్యపురి: హనుమకొండలోని జులైవాడలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు రూ.30 వేల విలువగల స్టీల్‌మగ్‌లు, పరీక్షల ప్యాడ్‌లను హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ శనివారం పంపిణీ చేశారు. జనగామ జిల్లాకు చెందిన బడుగు ఆంజనేయులు, మణెమ్మ, శ్రీకర్, భావన కుటుంబ సభ్యులు సామగ్రిని అందజేసినట్లు ఆయన వివరించారు. హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

ఖిలా వరంగల్: మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నయీమొద్దీన్ ఆరోపించారు. శాంతినగర్ రాజశ్రీగార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీ రుణాలు అందించడం లేదని వాపోయారు. మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, యాసిన్, అజహర్, ఎండీ.ఫకీర్, ఖహీం, సంబాని, రహేన, అఫ్రిన్ పాల్గొన్నారు.

ఏజేమిల్లుపై కౌన్సిల్‌లో చర్చించాలి

వరంగల్ అర్బన్: ఆజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవన స్థానంలో ఓ బడా వ్యాపారి నిర్మించనున్న కమర్షియల్ భవన నిర్మాణ అనుమతులపై ఈనెల చివరిలో జరగనున్న కౌన్సిల్‌లో చర్చించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు సూచించారు. ఈమేరకు నగర మేయర్ గుండు సుధారాణిని శనివారం సాయంత్రం కలిసి వినతిపత్రం అందజేశారు. బల్దియా డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, ఇండ్ల నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, అబుబక్కర్ నిర్మించిన 'అభివృద్ధి పాట' పాటల సీడీని బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. గాయకులు రమేష్, సాంబయ్య నేతృత్వంలో పాటలు రూపుదిద్దుకున్నాయి. పీసీసీ సభ్యుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు బర్ల యాకూబ్, గాజుల గోవర్ధన్, ఎంపీ రాజు, దేవేందర్, రాజమౌళి, కళాకారులు పాల్గొన్నారు.

మాధవరావు మృతి ఉద్యమానికి తీరనిలోటు

హన్మకొండ: సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగి, 40 ఏళ్లుగా హక్కుల ఉద్యమంలో భాగస్వామిగా ఉన్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొర్రపాటి మాధవరావు మృతి మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అద్దునూరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి వనపాకల దిలీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదావత్ రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.హరికృష్ణ తెలిపారు.

మాధవరావుకు నివాళి

వరంగల్: మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్రపాటి మాధవరావు హఠాన్మరణంపై మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల కమిటీలు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు వేమన వసంతలక్ష్మి, ఎస్.జీవన్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, వీఎస్.కృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

10లోపు ప్రతిపాదనలు పంపాలి



హన్మకొండ అర్బన్: భారతీయ మజ్దూర్ సంఘ్‌కు అనుబంధంగా ఏర్పడిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) వరంగల్ జిల్లా శాఖ ఆవిర్భావ సమావేశం నగరంలోని బాలసముద్రంలో సంఘ నాయకులు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్, కార్యదర్శి ప్రమోద్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు అయోధ్య రామయ్య హాజరయ్యారు. జనవరిలో రాష్ట్రస్థాయి పురస్కారాలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తిగల వారు జనవరి 10వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు.